# పోతనభాగవతంలో రసగుళికలు



– ఆర్.శర్మ దంతుర్తి

## 77 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 1, ప్రాచేతసనులకి చంద్రుడి బహుమానం

దేవదానవ యుద్ధం, వృత్రాసుర వృత్తాంతం, అందులో వచ్చే నారాయణ కవచం అతి ముఖ్యమైన ఘట్టాలు మహా భాగవతంలో. మనం నివసించే భూమిని ఎలా, ఎందుకు కాపాడుకోవాలి అనే విషయం నుంచి అసలీ వృత్రాసురుడెవరూ, ఎందుకు సంహరించబడ్డాడనేవి ఒక్కొక్కటీ తెలుస్తాయి. ఈ కథలోవే ఇంద్రుడికి బ్రహ్మ హత్యాపాతకం అంటుకోవడం, దాన్ని వదిలించుకోవడం అనేవన్నీ. కథ మొదలయ్యేది పృథు చక్రవర్తి సంతతి నుంచి, వాళ్ళెవరు, ఏం చేసారనేదానితో. మొదట్లో భూమి మీద నీరు తప్ప మరేమీ ఉండేది కాదనీ, ఒక్కొక్కటిగా వృక్షాలూ, పశుపక్ష్యాదులూ పుట్టుకొచ్చాయనీ తెలుసుకుంటాం. ఈ పద్యాలన్నీ కూడా సింగయ గారు – పోతన మొదట్లో రాసిన ఆరో స్కంధం పాడయ్యాక – తిరగరాసినవే.

పృథు చక్రవర్తి సంతతి వాడైన ప్రాచీనబర్హి అనే ఆయనకి (అనేకానేక యజ్ఞాలు మొత్తం భూమి ఉన్నంత మేర చేయడం వల్ల ఈ పేరు. తూర్పు దిక్కున ఉంటూ యజ్ఞం కోసం కుశ దర్భలు చేతిలో ఉంచుకోవడం వల్లా – ప్రాచీనము అంటే తూర్పు దిక్కు – ఆ పేరు వచ్చిందని మరో కథ) పదిమంది కొడుకులు. వీళ్ళని తండ్రి ప్రజోత్పత్తి చేయమని వినియోగించేసరికి వాళ్ళు తపస్సు చేయడానికి బయల్దేరారు. ప్రజోత్పత్తి కి ముందు ఎందుకీ తపస్సు అంటే, పుట్టే సంతతి మంచి వాళ్ళుగా ఉండాలనేది నియమం. సృష్టి మొదట్లోనే రాక్షసులు పుట్టడం మంచిది కాదు కదా? అదీ కాక ఒకసారి ఈ సంసారంలో పడితే భగవంతుడు గుర్తుండకపోవచ్చు. అందువల్ల ముందు భగవంతుడి గురించి పాటుపడితే తర్వాత విషయాలు వాటికవే సర్దుకుంటాయని బాగా తెల్సినవారు కనక తపస్సుకు బయల్దేరారు. దారిలో శివుడు కనిపించి ఉపదేశం చేసాక సముద్రంలో ప్రవేశించి దారుణమైన తపస్సు అవలంబించారు.

సీ. పూని ప్రచేతసుపుత్రులు పదుగురు;
ప్రాచీనబర్హిష ప్రాఖ్య గలుగు
వారు మహాంబోధి వలన వెల్వడి వచ్చి;
తగ వృక్ష వృతమైన ధరణిఁ జూచి
మేదినీజములపై మిక్కిలి కోపించి;
మదిలోన దీపితమన్యు లగుచు
వక్త్రంబులను మహావాయు సంయుతమైన;
యనలంబుఁ గల్పించి యవనిజములఁ [6-195]

తే. బెల్లువడఁ గాల్పఁ దొడఁగినఁ దల్లడిల్లి
వారి కోపంబు వారించువాఁడ పోలెఁ
బలికెఁ జందురుఁ డో మహాభాగులార!
దీనమగు వృక్షముల మీఁదఁ దెగుట దగునె? [6-195.1]

కొంత కాలానికి తపస్సు ఫలించాక మహావిష్ణువు చెప్తాడు, “మీరు మహేరుడి కూతురైన మారిషని వివాహం చేసుకోండి” అని. అలా తపస్సు చాలించి బయటకొచ్చారు. అంటే వీళ్ళ తపస్సు పూర్తి అయ్యేసరికి మరో కల్పం మొదలవడానికి భూమి జనావాసాలకి యోగ్యంగా ఉందనుకోవచ్చు. నీటిలోంచి (మహాంబోధి) బయటకొచ్చిన వీళ్ళకి ఇప్పుడు మొత్తం భూమి అంతా వృక్షాలతో కప్పబడి కనిపించింది. ఎక్కడా కూడా ఖాళీ అనేది లేకుండా మొత్తం అంతా చెట్లూ చేమలూను. ఇది చూసిన ప్రచేతసనులకి కోపం వచ్చి ఈ చెట్లని అన్నింటినీ తపశ్శక్తితో దగ్ధం చేయడం మొదలుపెట్టారు.

భగవంతుడు మననో పని చేయడానికి సృష్టించాడనుకోండి, ఆ పనికి కావాల్సిన వాటిన్నన్నింటినీ ఆయనే సమకూరుస్తాడు కదా, అలా ఈ వృక్షాలని కల్పించి ఉంచాడు. అలాగే భూమ్మీద కావాల్సిన మిగతావాటినీను. అబ్బే ఇవన్నీ నాకు అడ్డుగా ఉన్నాయ్, అని వాటిని కొట్టుకుంటూ పోతే మనకే నష్టం. ఇప్పుడు సృష్టి జరగాల్సిన సమయంలో ఇలా వృక్షాలని చంపకూడదు కదా. అందువల్ల ఈ ప్రచేతసనులు చేసే పని పైనున్న చంద్రుడు గమనించాడు. అంటే వీళ్ళిలా వృక్షాలని చంపడం మొదలయ్యే సమయానికే, ఒకప్పుడు భూమిలో అంతర్భాగంగా ఉండే చంద్రుడు వేరుపడి భూమ్మీద మనిషి మనుగడకి అన్నీ సిద్ధంగా ఉన్నాయన్నమాట. వీళ్ళని గమనించిన చంద్రుడు వచ్చి వీళ్ళతో పర్యావరణం, దాన్ని ఎందుకు రక్షించుకోవాలో చెప్తున్నాడు – ఒకచోటనుంచి మరోచోటకి కదలలేవు, ఎండా, వానా అనక ఓర్చుకుంటూ నీడనీ, ఫలాలనీ ఇచ్చే ఎంతో దీనమైన ఈ వృక్షాలని ఇలా చంపవచ్చా?

తే. మొదల వర్ధిష్ణు లగు మిమ్ము సదయ హృదయు
లగు ప్రజాపతు లనుచు సర్వాత్ముఁ డనియె;
నట్టి మీరు ప్రజాసృష్టి కైన వార
లీ వనస్పతి తతుల దహింపఁ దగునె? [6-196]

ఇలా పర్యావరణం ఎందుకు కాపాడుకోవాలనేది ఇంకా వివరంగా చెప్తున్నాడు చంద్రుడు. ప్రజాపతులగా వర్ధిల్లమని మిమ్మల్ని భగవంతుడు (సర్వాత్ముడు) సృష్టించాడు. అలా ప్రజాసృష్టి కోసం నియమితులైన మీరు ఈ వృక్షాలని చంపవచ్చా? ఈ సందర్భంలో మనం గుర్తుంచుకోవలసింది – చంద్రుడు వచ్చి చెప్పడం. కొత్త విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా సముద్రంలో ఉన్న ఆటుపోట్లకీ, మన వాతావరణానికీ, పర్యావరణానికీ అనేక సంబంధాలు ఉన్నాయి. ఇది చెప్పాక ఈ వృక్షాలని ఎవరు ఎందుకు సృష్టించారు, వాటినెందుకు కాపాడుకోవాలి, అవి ముందు తరాల వారికి ఎందుకు ముఖ్యమనేవి ఇంకా విశదీకరించి చెప్తున్నాడు ఇప్పుడు.

సీ. ఆదికాలంబున నా ప్రజాపతి పతి;
యైన లోకేశ్వరుం డచ్యుతుండు
పద్మనేత్రుఁడు వనస్పతుల నోషధి ముఖ్య;
జాతంబు నిషము నూర్జంబుఁ గోరి
కల్పించె; నందు ముఖ్యంబైన యన్నంబు;
నచరంబు లై నట్టి యపద మెల్లఁ

బాదచారులకును బాల్వెట్టి యిరుగాళ్ళ;
చేతులు గలిగిన జీవతతికి [6-197]

తే. పాణులొగి లేని యా చతుష్పాత్తు లెల్ల
నన్నముగఁ బూని గావించె నదియుఁగాక
నా మహాభాగుఁ డచ్యుతుఁ డాదరమున
మీకు ననఘాఖ్య విఖ్యాతి జోకపఱిచె. [6-197.1]

పూర్వకాలంలో భగవంతుడైన అచ్యుతుడు (చ్యుతి, నాశనము లేనివాడు), చెట్లనీ ఓషధులనీ సృష్టించాడు – ఆహారం కోసం, దానివల్ల మనుగడకి కావాల్సిన బలం కోసం (ఊర్జంబు గోరి). కదలలేని వాటిని (అచరాలు) కదిలేవాటి కోసం ఆహారంగా ఏర్పాటు చేసి పెట్టాడు. రెండు కాళ్ళ ఉన్నవాళ్ళకీ, నాలుగు కాళ్ళ ఉన్నవాళ్ళకీ తిండికి ఈ వృక్షాలే ఆధారం. అది అలా ఉంచితే ప్రజోత్పత్తి కోసం ప్రత్యేకంగా సృష్టించబడిన మీకు అనఘులు (పుణ్యాత్ములు) అనే పేరు కల్పించి పెట్టాడు. ఈ విషయం ఓ సారి నిశితంగా చూస్తే మత్స్యావతారం కథ గుర్తుకొస్తుంది. కల్పాంతంలో బ్రహ్మ నిద్రలోకి జారుకుంటున్నప్పుడు విష్ణువు వేదాలని సంరక్షించడానికి మత్స్యావతారం ఎత్తి సత్యవ్రతుడితో చెప్తాడు, 'ఓషధులనీ విత్తనాలనీ, సప్తర్షులనీ నావలో ఉంచి సిద్ధంగా ఉండు, నేను వచ్చి మళ్ళీ బ్రహ్మ నిద్రలేచేదాకా మీ అందర్నీ నావలో క్షేమంగా ఉంచుతాను' అని. అలా ఒక కల్పం నుంచి మరో కల్పానికి ప్రజోత్పత్తి మొదలయ్యేసరికే వేదాలతో సహా అన్నీ సిద్ధంగా ఉంచాడని చంద్రుడు చెప్తున్నాడన్నమాట. ఇదే నారు పోసినవాడు నీరు పోయడా అనేదానికి అర్థం కూడా. అదీగాక ఇందులో మరో విశేషం ఉంది.

చంద్రుడి మనసులో మెదిలే మరో ఆలోచన – ఇదేమిటి వీళ్ళు ప్రజాపతులై కూడా ఇటువంటి పనులు చేస్తున్నారనేది – కూడా వాళ్ళతోటే చెప్తున్నాడు.

క. నిజముగ దేవాధీశ్వరుఁ
డజుఁడు ప్రజాసర్గమునకు ననఘుల మిమ్ముఁన్
సృజియించె నిట్టివారికిఁ
గుజదహనము చేయ నెట్లు గోరిక పొడమెన్? [6-198]

నిజంగా మీరు ప్రజాపతులే అయితే, మిమ్మల్ని భగవంతుడు ఇలా సృష్టించినట్లైతే మీకు అసలు ఇలా వృక్షాలని దహించాలనీ, వీటి మీద ఆ కోపం ఎందుకు వచ్చిందో? ఇదే మనక్కూడా వర్తిస్తుంది. రోజురోజుకీ ఇలా పర్యావరణం పాడుచేసుకుంటూంటే ఏమౌతోందో తెలిసి కూడా చేతులు కట్టుకుని కూర్చుంటున్నాం కదా? ఈ పద్యంలో వృక్షం అనేది ఎక్కడుందో చెప్పండి చూద్దాం? కుజము – కు (భూమి), జము (జనించేది) – వృక్షము.

చ. సతత మహత్త్వ సత్త్వ సత్పురుషస్మృతిఁ గుణ బొందరయ్య! మీ
పితరులునుం బితామహులుఁ బెద్దలు నెన్నఁడుఁ బొందనట్టి దు
ష్కృతమతమైన కోపమునఁ గిల్బిషభావము మానరయ్య! సం
భృత కరుణావలోకమున భీత తరుప్రకరంబు జూచుచున్. [6-199]

ఇప్పుడీ కుజదహనం ఆపి, మేము ఎప్పుడూ ఎవరికీ అపకారం చేయని సత్పురుషులం అనే ఆలోచన మనసులోకి రానీయండి. మీ పితామహులూ, పెద్దలూ ఎప్పుడు పొందనట్టి కోపం విసర్జించి పాపపు ఆలోచనలు (కిల్బిష భావము) మానుకోండి. ఇప్పుడు మిమ్మల్ని చూసి భయపడే ఈ వృక్షాలని కరుణతో కాపాడండి.

ఉ. తప్పక యర్భకావళికిఁ దల్లియుఁ దండ్రియు నేత్రపంక్తికిన్
ఱెప్పలు నాతికిం బతియు ఱేఁడు ప్రజావళి కెల్ల నర్థి కిం
పొప్ప గృహస్థు మూఢులకు నుత్తము లెన్న సమస్తబాంధవుల్
ముప్పునఁ గావలేని కడుమూర్ఖులు గారు నిజాల చుట్టముల్. [6-200]

పిల్లలకి (అర్భకావళికి) తల్లితండ్రులూ, కళ్ళకి కనురెప్పలు, భార్యకి భర్త (నాతికిం బతియు), రాజు ప్రజలకి (ఱేఁడు ప్రజావళికి), అభ్యాగతికి గృహస్థులు, మూఢులకి ఉత్తములూ బంధువులైనట్టుగా కష్టం వచ్చినప్పుడు ఆదుకున్నవారే నిజమైన చుట్టాలు కదా? ఈ పద్యంలో ఎవరు ఎవర్ని న్యాయంగా ఎలా జాగ్రత్తగా చూసుకోవాలో, చూసుకుంటారో సరిగ్గా చెప్పాడు గమనించారా? అందుకే భాగవతం ఏదో కథలా చదివి అవతల పారేసేది కాదు. మనం రోజువారీ ఆచరించగలిగేవి అన్నీ గమనిస్తే విశదంగా కనిపిస్తాయి.

సీ. అఖిల భూతముల దేహాంతస్థమగునాత్మ;
యీశుఁ డచ్యుతుఁడని యెఱుఁగవలయు;
నెఱిఁగి సర్వం బైన యిందిరారమణు లోఁ;
జూపులఁ దనివిగాఁ జూడవలయు;
జూచిన చిద్రూప శుద్ధాత్ము లగు మిమ్ము;
నెనసిన వేడ్కతోనిచ్చమెచ్చు;
మెచ్చిన సర్వాత్ము మీ రెఱింగినచోటఁ;
గోపగుణంబులఁ బాపవలయు; [6-201]

ఆ. బాపి దగ్ధశేష పాదపజాలంబు
దియ్య మెసఁగ బ్రతుకనియ్యవలయు;
ననఘులార! మీర లస్మదీయప్రార్థ
నంబు పరఁగఁ జేకొనంగవలయు. [6-201.1]

ఇవన్నీ ఒక ఎత్తైతే మరో ముఖ్యమైన విషయం ఉంది. చరాచర ప్రపంచంలో అన్ని దేహాలలో అంతర్గతంగా ఉండే ఆత్మ ఈ భగవంతుడే అని తెలుసుకోవాలి. ఇదే శుకమహర్షి చెప్పినది – 'హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు సంశయము పనిలేదా' అనే పద్యంలో కూడా. అలా అన్నింటిలోనూ ఉన్నది ఆ ఇందిరారమణుడే అని చూస్తే, భగవత్స్వరూపులైన మిమ్మల్ని ఆ శ్రీహరి మెచ్చుకుంటాడు. అందువల్ల ఈ కోపం గుణం ఆపి ఈ వృక్షాలని బతకనివ్వాలి. అందువల్ల నేను చేసే ఈ ప్రార్థన ఆలకించి ఈ వృక్ష దహనం ఆపండి.

క. ఇదె వృక్ష సముద్భవ యగు
మదిరేక్షణ నాప్సరసిఁ గుమారిక నిత్తున్
వదలక పత్నిఁగఁ జేకొని
ముద మందుఁడు పాదపముల మోసమువాయన్. [6-202]

అయితే ఇలా ఆపడం వల్ల మాకేం ఒరుగుతుందని అడగడం సహజం కదా? దానిక్కూడా చంద్రుడి దగ్గిర సమాధానం ఉంది. ఇలా మానడం కోసం మీరు అప్సరస కుమార్తె అయిన ఈ అమ్మాయిని ఇస్తున్నాను. ఈ అప్సరసే విష్ణువు చెప్పిన మారిష అనే ఆవిడ. ఈవిడతో సంసారం చేసి ప్రజోత్పత్తి చేయండి, ఈ వృక్షాలని ఆపదలనుంచి కాపాడండి. ఈ పద్యంలో వృక్షాలకి మరో పేరు – పాదపములు.

వ. అని యిట్లామంత్రణంబు జేసి, మారిష యను కన్యకను వారల కిచ్చి చంద్రుండు చనియె; అప్పుడు. [6-203]

చంద్రుడు ఇలా ప్రాచేతసనులకి చెప్పి మారిష అనే అప్సరస స్త్రీని – విష్ణువు ఎవరినైతే వివాహం చేసుకోమన్నాడో ఆవిడనే - వాళ్లకిచ్చి వెళ్ళాడు. ఈ మారిష కీ, ప్రచేతసనులకీ పుట్టినవాడే దక్ష ప్రజాపతి. దక్షుడికి అసక్ని అనే భార్య వల్ల సతీదేవితో సహా కొంతమంది కుమార్తెలూ, అలా వాళ్ళనుంచి మిగతా సృష్టి అంతా ప్రభవించడం చూస్తాం. ఈ దక్షుడి కూతుర్లలో కొంతమంది మనకి బాగా తెల్సినవాళ్ళే – వినత, కద్రువ, సతి, దితి, అదితి, ఇల, అరిష్ట మొదలైనవారు. దక్ష ప్రజాపతి కూతురైన సతీదేవి శివుణ్ణి వరించి దక్షయజ్ఞానికి వెళ్లడం ఆ తర్వాత ఆ యజ్ఞవాటికలో దేహం చాలించి అర్థనారీశ్వరిగా పరమేశ్వరుణ్ణి చేరుకోవడం మనకి తెల్సినదే.

దక్ష ప్రజాపతి కూతుర్లలో ఒక్కొక్కరి వల్లా ఒక్కొక్క సంతతి పెరగడం గమనించవచ్చు. వినత వల్ల (సూర్య రథసారథి అనూరుడు, విష్ణువాహనుడైన గరుడుడు), కద్రువ వల్ల నాగులు (శివుడి మెడలో ఉండే దానితో సహా), దితి వల్ల దైత్యులూ, అదితి వల్ల ఆదిత్యులూ, అరిష్ట వల్ల గంధర్వులూ అలా వీరి సంతతి ప్రభవించడం భాగవతంలో చూడవచ్చు. అయితే ప్రజాపతులు మొదట్లో తపస్సుచేసి మంచి కోసం ప్రజోత్పత్తి సాగించినా ఉత్తరోత్తరా ప్రభవించిన సృష్టిలో అటు మంచివారూ (సురలు) ఇటు చెడ్డవారూ (అసురలు) పుట్టడం గమనిస్తే మనకి తెలిసేదేమంటే ఈ మొత్తం చరాచర విశ్వంలో ఏది ఎలా పుట్టి పెరిగినా, అది భగవత్స్వరూపుడైన ఆత్మ స్వరూపం. అందుకే ఎన్నిసార్లు భాగవతం చదివినా మనం గుర్తుపెట్టుకోవల్సినది “హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయిందు సంశయము పనిలేదా...” అనేది మాత్రమే. దీనినే అహం బ్రహ్మాస్మి, తత్వమసి, సర్వం ఖల్విదం బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ అనే పంచ మహావాక్యాలుగా చెప్పుకున్నాం క్రిందటి వ్యాసాల్లో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS